

హుఁ! అప్పుడే తెల్లవారింది! ఇంటి వారి అమ్మాయిని చూసి నాలో నేనే నిట్టూర్చాను. అపర్ణ వచ్చి నా ముందు నిలుచుని కొత్తగా వాడుతూన్న ఎలిజిబెత్ ఫెయిర్ క్రీమ్ ఎంతవరకు పని చేసిందో పరీక్షించుకోవటం మొదలు పెట్టింది. బుగ్గలు కొద్దిగా మెరుపు వచ్చినట్లే కనిపించాయి. మొహాన్ని ఇటు తిప్పి, అటు తిప్పి చూసుకొంది. మోచేతులు ముడుచుకొని చూసుకుంది.

“బాగానే ఉన్నావులే, వెళ్ళి ముఖం కడుగమ్మా.” గొణుక్కున్నాను. ఎట్లా. అయితే నేం — పది నిమిషాలకి కదిలింది.

“హమ్మయ్య!” అని సంతోషంగా ఇటూ అటూ ఊగాను. కానీ, ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. కారణం — ఇంటి వారి కోడలు శారద వచ్చి షోగ్గా స్టూలు మీద కూర్చుంది. ఒక్క రాత్రి గడిచేసరికి తన ముఖంలో ఏమైనా ముడతలు ఏర్పడ్డాయేమోనని

నన్ను రెండు చేతులతో దగ్గరగా తీసుకుని చూసింది. పట్టి పట్టి చూసుకొని, "ఛీ! ఈ కళ్ళ కింద నల్లగీత లేమిటి?" అని విసుక్కొంది. "ఆ సంగతి వప్పుడుగు తావేం? నీ పయస్సు వడుగు." అరుద్దా మనుకున్నాను.

తరవాత మెల్లగా జడ విప్పుకొంది. ఊడిపోతూండన్న బాధతో దాన్ని జాగ్రత్తగా గుప్పెటతో పట్టుకుని లావు చూసుకుంది. కానీ, గుప్పెట్లో పగానికే వచ్చిన ఆమె వేణీ సంపదని చూసి నాకు నవ్వు ముంచుకొచ్చింది. తలకి బాగా గోరింట నూనె పట్టించి ఎలాగైతేనేం నా ముందునించి కదిలింది. కాస్సేపు విశ్రాంతిగా నిలబడ్డాను.

మళ్ళీ ఎనిమిదవుతూంటే హడావిడి మొదలయింది. ఇంటివారి కొడుకు పేరు లవవానికి ప్రశాంత్ కానీ, అతనంత ప్రశాంతంగా డేపరగా ఉండడు. అలా ఉండకపోయినా సంటే పేరుకీ, స్వభావానికీ సహ్యాసం తేడా ఉంది. మడత నలగని ఇస్త్రీ బట్టలు వేశాడు. కాస్సేపు కాలరు సర్దుకున్నాడు.

'ఇక ఈయన గారి క్రాప్ దువ్వటం పూర్తయ్యేసరికి నాకు నీరసం వస్తుంది' అనుకుంటూ వెనక్కి వాలాను.

ముందుగా తలకి బ్రిల్‌క్రీమ్ పట్టించాడు. ఆ తరవాత దువ్వెన పట్టుకొని, నిటారుగా నిలబడుతూ తిరగబడుతున్న వెంట్రుకలతో తలబడ్డాడు. ఎల్లాగయితేనేం మొత్తానికి ముళ్ళ పంది ఒంటిమీద ముళ్ళుగా ఉన్న జుట్టుని పట్టుకొని ఒక పక్కకి వంచాడు. ఇక ముఖ సౌందర్యానికి పూనుకున్నాడు. ముందుగా నల్లటి ముఖానికి తెల్లటి స్నో పట్టించాడు. ఆ తరవాత అర్థ రూపాయి మందాన పౌడర్ పట్టించాడు. నుదుటి మీదికి గుప్పెడు జుట్టు పీక్కున్నాడు. ముఖాన్ని అనేక కోణాల్లో చూసుకుంటూండగా "చింపాంజీలా ఉన్నావులే వెళ్ళు. అప్పుడే ఎనిమిది న్నరయింది" అని పణిగా.

అపర్ణ వచ్చి అతణ్ణి గెంటి టేబిల్ మీద తను ప్రత్యక్షమయింది. కాస్సేపు కదులూ మెదులూ లేక కూర్చుని తన ముఖాన్ని చూసుకుంది. 'వదినలా నేనూ తెలుపే అయితే ఎంత బాగుండును!' అనుకుంది. జుట్టు విప్పి జాగ్రత్తగా నడినెత్తిమీదికి పట్టుకొంది. దాన్ని జాగ్రత్తగా మెలి తిప్పి వరసగా ఒక అర డజను రబ్బర్ బాండ్స్ తగిలించింది. వెనక్కి వేసుకుని ఊహూ చూసుకో సాగింది. 'కట్లపాములా నువ్వూ, నీ హెయిర్ స్టైలూ బాగానే ఉన్నావులే!' మనసులోనే నవ్వుకున్నాను.

## అంతర్జాతీయ మహిళా సంవత్సరం

మా ఇంటికి
తెలిసిపోయింది —
ఈ సంవత్సరం
అంతర్జాతీయ
మహిళా సంవత్సరమని!
ఆ రోజున
వంటింట్లో నుంచి
కేకేసి మరీ అన్నది —
'ఏమండోయ్!
బుజ్జిగాణ్ణి నే వెళ్ళి
బళ్ళో చేర్పించి వస్తా!
తండ్రిపేరు అని ఉన్న చోట
తల్లిపేరు రాయించి మరీ వస్తా!'

—ఆనంద్

తరవాత ముఖానికి పౌడర్ పూసింది. కళ్ళకి వెడల్పుగా కాటుక పెట్టుకుంది. చీపురుపుల్ల వెతికి తెచ్చి కాటుకలో ముంచి ఇటు అంగుళం, అటు అంగుళం పుల్లలు గీసింది. కళ్ళని పెద్దవి చేసీ, చిన్నవి చేసీ చూసుకొంది. ముదురు నీలం చీరకి మాచ్ అయేటట్లుగా ముదురు నీలం కుంకుమ తీసి పయూపైసా అంత పెట్టుకొంది. ఆ తరవాత నిలబడీ, నడిచీ పెద్ద బార్డర్ కనబడేటట్లుగా పిన్ చేసుకొని, ఆఖరిసారిగా తొంగిచూసి కదిలింది. 'అమ్మా! నువ్వు చాయ తక్కువ. ఏ మేకప్ చేసుకోకుండా, ఆ డార్క్


## టి. స్వరాజ్యలక్ష్మి

కలర్ శారీస్ మానేస్తే చాలా అందంగా ఉంటావు' అని చెబుదా మనుకున్నాను. కానీ, నిజం చెపితే నిష్ఠూరం అని మళ్ళీ మానేశాను.

అన్నం తినేసి హడావిడిగా నా ముందు వాలిన సునీతనీ, అనిల్‌నీ చూసి ఉత్సాహంగా ముందుకీ, వెనక్కీ ఊగాను. తమ బుల్లి బుల్లి చేతులతో తలలు దువ్వుకోటం మొదలు పెట్టారు. జాగ్రత్తగా తల వంచి పాపిడి తీసుకొని తెల్లని రిబ్బన్‌తో పోనీ టెయిల్ కట్టింది. తన చేతిలో పౌడర్ ఎక్కువ పడిపోయిందని సునీత చేతిలో సగం పోసి, మిగిలింది తన ముఖానికి పూసుకున్నాడు అనిల్. ఒకే స్టూలు మీద జాగ్రత్తగా కూర్చుని టాయిలెట్ అవుతూన్న వాళ్ళిద్దర్నీ చూసి ఎంతో ముచ్చట పడ్డాను. మనసులో ఏ మాయామర్మం లేదు కనక వీళ్ళ ముఖాలింత ప్రశాంతంగా ఉన్నాయి. మనసులో చచ్చేటన్ని ఆలోచనలు పెట్టుకొని పైపైన ఎన్ని క్రీములు రాస్తే మాత్రం అందం వస్తుందీ పెద్దవాళ్ళకి! పిల్లలిద్దర్నీ మళ్ళీ రేపు పొద్దున్నవరకూ కలుసుకోనే అని దిగులు పడ్డాను కిలకిలా నవ్వుతూ వెళ్ళిపోయారు.

పది గంట లవుతూ ఉండగా ఇంటి వారి పెద్దకొడుకు మూర్తి వచ్చాడు. ఇతని వల్ల రోజూ పెద్ద బాధ ఉండదు కానీ, నాటకాలేమైనా వేసే ముందు మాత్రం నా ప్రాణం తీస్తాడు. నాటకాల రిహార్సలు గంటలకొద్దీ చేసి తెగ బోరు కొట్టేస్తాడు. ఒకసారయితే ఫరవాలేదు కానీ, ఆ పద్యాలని అప్పడాల పిండిలా తెగ సాగదీస్తాడు. గబగబ ముస్తాబు ముగించి అయిదు నిమిషాలు తలలోని తెల్ల వెంట్రుకలు కనబడకుండా దువ్వుకొని లేచాడు.

పదకొండు గంటలవుతూండగా ఇంటి యజమాని పంచె సరిచేసుకుంటూ వచ్చి కూర్చున్నాడు. బట్టతల మీద మిగిలిన





ముస్తాబు

చిత్రం— బి. ఎల్. రామాంజనేయులు (గుంతకల్)

పిడికెడు వెంట్రుకలనీ తలంతా జాగ్రత్తగా పర్చుకున్నాడు. పౌడర్లూ, స్నోలూ పూసించలేదుకానీ. తల ఒరగా పెట్టి, గడ్డం నిమురుకుంటూ సాలోచనగా చూసుకున్నాడు. "ఏమండోయ్, పరంధామయ్యగారూ!" అన్న స్నేహితుడి కంఠం విని గబగబ బయటకు నడిచాను.

పన్నెండు గంటలు కొట్టింది హాల్లో గోడ గడియారం. 'అరే! ఇంకా సీతమ్మ గారు రాలేదేమిటి?' అనుకున్నాను. ఇంట్లో అందరిలోకీ ఆవిడే బాగుంటుంది లక్ష్మీదేవిలా. ఆఁ. అరుగో, సీతమ్మగారు వస్తున్నారు. అయ్యో, అదేమిటి? అలా దిగులుగా కనిపిస్తున్నారు. 'ఎందుకమ్మా దిగులు?' అని అడుగుదామని నాలుక చివరిదాకా వచ్చిందికానీ, ఆవిడే చెబుతుందిలే అని ఊరుకున్నాను.

శనివారం అని తలస్నానం చేసినట్లుంది. *ఆరబెట్టుకోవటానికి కూడా* తీరికలేక అలాగే ముడిపెట్టుకున్న జుట్టుని విప్పింది. పైటకొంగుతో ముఖాన పట్టిన చెమటని తుడుచుకుంది. ఎర్రటి కుంకుమ తీసుకొని విశాలమైన నుదుట అద్దుకొని, దువ్వెనతో చిక్కుతీసుకోవటం మొదలు పెట్టింది. మెల్లిగా తనలో తను "ఏమిటో, పెద్దమ్మాయి పెళ్ళికయిన అప్పే ఇంకా తీరలేదు. అప్పుడే సంక్రాంతి పండగ వస్తోంది. అల్లుడు గారు టేప్ రికార్డర్ బహుమతిగా కావాలంటున్నారని రాసింది అమ్మాయి. పదహారు వంట లవుతుందట. ఎక్కడ తేవాలో ఏమిటో! కాస్సేపు నడుం వాలుస్తాను కాఫీల వేళదాకా" అనుకొంటూ లేచిందావిడ. "అయినా, ఈ పెద్దల్లుడికేమైనా బుద్ధుందా అసలు? ఇంజినీరు చేస్తున్నాడు కదా? ఆమాత్రం టేప్ రికార్డర్ కొనుక్కోలేడూ! సిగ్గుండాలి ముఖానికి." సీతమ్మగారి కేసి సానుభూతిగా చూశాను. అంతకంటే నేనేం చెయ్యగలను?

అమ్మయ్య! ఉదయం డ్యూటీ అయింది. మళ్ళీ సాయంత్రం దాకా కాస్త నేను కూడా రెస్టు తీసుకొంటాను. ఎవరైనా ఆ కిటికీలు మూసేస్తే బాగుండును. ఈ పిచికలు మహా ప్రాణం తీస్తున్నాయి. పొడిచి పొడిచి విసిగిస్తాయి.

కొన్నాళ్ళు మార్పు ఉంటే బాగుండుననిపిస్తోంది. ఈ ఇంట్లో వాళ్ళతో విసుగొస్తోంది. రోజూ ఈ ముఖాలనే చూసి చూసి విసుగ్గా ఉంది. వాళ్ళు మహారంభలయినట్లూ, నేనేదో అబద్ధం చెబుతున్నట్లూ బాధపడిపోతారు. చిరాకుపడతారు. ఒక విధంగా ఆలోచిస్తే ఈ ఇంట్లో వాళ్ళే నయం.

మొన్న కలర్ వేయించుకోవటానికి షాప్ కెడితే ఏం జరిగిందీ? అవటానికి చక్కటి అందమైన దంతపు ఫ్రేమ్‌లో ఉంది. అయితేనేం? తన బ్రతుకంత ఘోరమైనదేదీ ఉండదంది. మళ్ళీ రాజకీయ నాయకుడి ఇంట్లో, బోలెడు ధనవంతులింట్లో ఉంటూండన్న పేరు. కానీ, రోజూ ఆ నాయకుడి మొహం చూడాలంటే తన కెంత బాధో ఎవ్వరూ అర్థం చేసుకోరు.

"ఇంత పెద్ద బాన పొట్ట వేసుకొని దేశంలో దారిద్ర్యానికల్లా తనే కారణమన్నట్లుంటాడు. దరిద్రానికి కారణం అంటే తిండిలేదని అనుకునేరు. పారపడ్డారన్న మాట! ప్రజల నోట్లో మట్టికొట్టి లక్షలకి లక్షలు నిలవచేశాడు. గాంధీ టోపీ క్రింది తలలో ఎంతసేపూ పదవి ఎక్కడ పోతుందో అన్న ఆలోచనే నాయె! *ఖద్దరు కట్టినంతమాత్రాన నిరా*డంబరు డనుకుంటాడు. మళ్ళా తిరిగేది పది లక్షల ఫారిన్ కారులో. ఛీ! ఛీ!! వీడి ముఖం చూసేకంటే తల నేలకేసి కొట్టుకొని చావటం నయమనిపిస్తోంటుంది" అని బాధపడింది.

"బాబోయ్! ఆ బ్రతుకుకంటే ఇదే నయం. ఈ ఇంట్లో వాళ్ళు అందంగా లేకపోవచ్చు. కానీ, దుష్టులూ, దుర్మార్గులూ కారు."

ఇలా నా ఆలోచనలు సాగిపోతూనే ఉన్నాయి. తలుపులు ఢడాలున తెరుచుకున్నాయి. ప్రశాంత్ సుడిగాలిలా లోపలికి వచ్చాడు. ఎవరినో తెగ తిడుతున్నాడు.

"ఇడియట్స్! చింతపండు — జీడిగింజ. నేను చింతపండులా ఉన్నానా? జీడిగింజంత నల్లంగా ఉన్నానా? — తను ఎంత కాలేజీ బ్యూటీ అయితే మాత్రం? నన్నల్లా అవమానిస్తుందా? ఎంత పొగరు!" ఇలా తిడుతూ నన్ను రెండు చేతులతో పట్టుకొని ఊపెయ్యటం మొదలెట్టాడు. చంపేస్తాడేమో ననే భయంతో ప్రాణాలు బిగపట్టుకొని చూడసాగాను. ఉండి ఉండి ఒక్కసారిగా వదిలేశాడు. గుండె దడదడ లాడిపోయింది. వెనక్కెళ్ళి ముందుకొచ్చి నాలుగు సార్లు చూసుకున్నాడు. చేతిలో గుప్పెడు పౌడర్ వేసుకొని ముఖానికి పులుముకున్నాడు. ఇంతలో ఏమొచ్చిందో ఏమో కాలితో నన్ను విసురుగా వెనక్కి తన్నేసి వెళ్ళిపోయాడు.

నా జీవితం వెయ్యి ముక్కలయిపోయింది. "ఏమిట్రా ఆ చప్పుడు?" అంటూ వస్తోంది నా యజమానురాలు. "అయ్యో, అయ్యో!" అని నోరు తెరుచుకుని నిలబడి పోయింది కోడలు. అప్పుడే ఇంట్లోకి ప్రవేశించిన ఇంటి యజమాని "ఎవర్రా నిక్షేపంలాంటి అద్దం బద్దలు కొట్టింది?" అని అరిచారు.

"ఏమయితేనేం? నా జీవితం ఇంక మట్టిలో కలిసిపోయింది. నా కీ ప్రపంచంతో ఋణం తీరిపోయింది." ✱